క్లుప్తంగా

దాసాంజనేయ స్వామికి విశేష పూజలు



నందిగామ రూరల్: మండలంలోని కె.కంద్రిక గ్రామంలో వేం చేసి ఉన్న దాసాంజనేయ స్వామి వారి ఆలయంలో హనుమత్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. వేడుకల్లో భాగంగా మంగళవారం స్వామి వారిని పలు రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ నెల 22న హనుమత్ జయంతి సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం, నాగవల్లి అర్చన, లక్ష్మీగణపతి, నవగ్రహ హోమాలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ మేడా రామారావు తెలిపారు. అదే విధంగా మండలంలోని పల్లగిరి గట్టుపై వేం చేసి ఉన్న అభయాంజనేయ స్వామి, నందిగామ పట్టణంలోని సీతారామాంజనేయ స్వామి వారి ఆలయాల్లో సైతం హనుమత్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు హనుమాన్ శోభాయాత్ర

నందిగామరూరల్: అయ్యప్ప సేవా సమితి, వెంకన్న గురుస్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో నందిగామ పట్టణంలో బుధవారం హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సేవా సమితి నిర్వాహకుడు వెంకన్న గురుస్వామి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ.. హనుమత్ జయంతి సందర్భంగా పట్టణంలోని రథం సెంటర్ నుంచి ప్రధాన వీధుల్లో శోభాయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే శోభాయాత్రలో కాషాయ దుస్తులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రేపు ఇంద్రకీలాద్రిపై హనుమత్ జయంతి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై ఈనెల 22వ తేదీ హనుమత్ జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో శీనానాయక్ తెలిపారు. ఘాట్‌రోడ్డులోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయంలో, పాత మెట్ల మార్గంలోని ఆంజనేయ స్వామి వారి ఆలయంలో ఉదయం 6 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, నాగవల్లీ దళార్చన నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు వద్ద స్వామి వారికి విశేష పూజలు, నాగవల్లీ దళార్చన జరుగుతుందని తెలిపారు.

ఎయిడ్స్‌పై కళాజాతా ప్రదర్శన

ఇబ్రహీంపట్నం: జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో ఎయిడ్స్ వ్యాధి నియంత్రణపై కళాజాతా ప్రదర్శన మంగళవారం నిర్వహించారు. హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి రావడానికి గల కారణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులపై వివక్ష చూపకుండా ఉండటం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సుఖ వ్యాధులు, టీబీ వ్యాధి చికిత్సలు, సమాజంలో వారిని ఆదరించడం వంటివి వీధి నాటకం ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్నేహ ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

జి.కొండూరు: ఆంధ్రప్రదేశ్ మైనార్టీ కార్పొరేషన్ ద్వారా బీసీ-సి, సిక్కు, పార్సీ, మైనార్టీ వర్గాల వారి నుంచి సబ్సిడీ రుణాల మంజూరుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపీడీఓ రామకృష్ణ నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా స్వయం ఉపాధి పథకాలకు రుణాలు మంజూరు చేస్తారని చెప్పారు. ఆయా వర్గాలకు చెందిన వారు సబ్సిడీ రుణాలకు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ పేర్కొన్నారు.

నగదు చోరీకి పాల్పడిన యువకుడు అరెస్ట్

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో భద్రపరిచిన నగదు చోరీకి పాల్పడిన యువకుడిని కొత్తపేట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం లంబాడీపేటకు చెందిన దుగ్గిరాల బిక్షాలు పాలప్రాజెక్టులో పాల సరఫరా చేసే యార్లగడ్డ రాజారావు ట్రాన్స్‌పోర్ట్‌లో వెహికల్ సూపర్‌వైజర్‌గా పని చేస్తుంటాడు. పాలను సరఫరా చేసే వ్యాన్‌లోని సిబ్బంది వద్ద నగదును తెచ్చి బిక్షాలు రాజారావుకు అందజేస్తుంటాడు. అదే విధంగా 19వ తేదీ సోమవారం కలెక్షన్ డబ్బులు మొత్తం రూ.1.89 లక్షలను ఆఫీసు టేబుల్‌లో ఉంచి తాళం వేశాడు. అదే ఆఫీసులో పని చేసే బైవరపు రాజేష్‌కు పని మీద బయటకు వెళుతున్నట్లు చెప్పి వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో తిరిగి వచ్చేసరికి ఆఫీసులో రాజేష్ కనిపించలేదు. దీంతో టేబుల్‌లో దాచిన డబ్బులు కనిపించలేదు. దీంతో ఈ ఘటనపై బిక్షాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం పాలప్రాజెక్టు పరిసరాల్లో తిరుగుతున్న రాజేష్‌ను అదుపులోకి తీసుకుని చోరీకి పాల్పడిన నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

అసంపూర్తిగా సచివాలయాల పనులు

- సచివాలయ వ్యవస్థపై కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం
- అర్థాంతరంగా నిలిచిన భవనాల పనులు
- నిర్మాణాలు పూర్తిచేయాలంటున్న ప్రజలు



సుబ్బాయిగూడెంలో అసంపూర్తిగా సచివాలయ భవనం పనులు



కొణకంచిలో సచివాలయ భవనం పరిస్థితి ఇది

పెనుగంచిప్రోలు: మహాత్మాగాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్యంలో భాగంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజల ఇంటిముంగిటికే పాలన అందించేందుకు గ్రామాల్లో సచివాలయాల నిర్మాణాలు చేపట్టారు. అయితే పెనుగంచిప్రోలు మండలంలో పలు సచివాలయాల నిర్మాణాలు పూర్తికాగా, మరికొన్ని సచివాలయాల పనుల్లో ఒక్క ఇటుక కూడా పెట్టకపోవడం గమనార్హం. దీంతో సచివాలయాల సిబ్బంది తమ విధులను ఆయా పంచాయతీ కార్యాలయంలోనే నెట్టుకొస్తున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో సరైన వసతులు లేక ఇరుకు గదుల్లోనే విధుల నిర్వహిస్తూ అవస్థలు పడుతున్నారు.

ఆరు భవనాల పనులు పెండింగ్..

పెనుగంచిప్రోలు మండలానికి 15 సచివాలయాలు మంజూరయ్యాయి. ఒక్కో భవనానికి రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు కేటాయించి పనులు చేపట్టారు. ఇప్పటికే పెనుగంచిప్రోలులో రెండు సచివాలయాలు, అనిగండ్లపాడు, శివాపురం, గుమ్మడిదుర్రు, లింగగూడెం, ముండ్లపాడు, నవాబుపేట, శనగపాడు గ్రామాల్లో ఒక్కొక్కటి చొప్పున మొత్తం తొమ్మిది సచివాలయ భవనాల పనులు పూర్తికావడంతో సిబ్బంది ఆయా కార్యాలయాల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. గతేడాది మే నాటికి సుబ్బాయిగూడెం గ్రామంలో చేపట్టి సచివాలయ భవన నిర్మాణం పనుల్లో రెండు ఫోర్లు శ్లాబ్ పూర్తి అయ్యింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో గోడలు కూడా నిర్మించారు. కొణకంచిలో భవనం మొత్తం నిర్మాణం పూర్తయి, డోర్లు పెట్టాల్సి ఉంది. మిగిలిన పనులు ఏడాదిగా ఎక్కడికక్కడే నిలిచిపోయాయి.

పంచాయతీ భవనాల్లో సచివాలయాలు..

ఇక ముచ్చింతాల, వెంకటాపురం, పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడులలో ఒక్కొక్కటి చొప్పున మరో నాలుగు సచివాలయాల పనులు అసలు ప్రారంభించనే లేదు. ఈ సచివాలయాలు ఆయా పంచాయతీ భవనాల్లో కొనసాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూతన భవన నిర్మాణాల పనుల సంగతి అటుంచి, కనీసం పెండింగ్‌లో ఉన్న పనులనైనా పూర్తి చేయించేందుకు దృష్టి సారించలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారు. లక్షలాది రూపాయల ప్రజాధనం వెచ్చించి చేపట్టిన ఆయా సచివాలయాల పనులు అర్థాంతరంగా నిలిచిపోవడం ద్వారా సచివాలయ సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ కార్యాలయాల్లోనే అరకొర వసతులతో సచివాలయ విధులను నిర్వరిస్తున్నారు. ఇకనైనా కూటమి పాలకులు స్పందించి పెనుగంచిప్రోలు మండలంలో అసంపూర్తిగా ఉన్న సుబ్బాయిగూడెం, కొణకంచి సచివాలయ భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ రాజ్‌శాఖ అధికారులను వివరణ కోరగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పనులు ప్రారంభిస్తామని పేర్కొనడం గమనార్హం.

పంచాయతీ భవనంలోనే నిర్వహణ..



సుబ్బాయిగూడెంలో భవన నిర్మాణ పనులు పూర్తికాకపోవడంతో సచివాలయాన్ని పంచాయతీ కార్యాలయంలోనే నిర్వహిస్తున్నాం. సిబ్బంది అందరికీ భవనం సరిపోవడం లేదు. అసంపూర్తిగా మిగిలిన పనులను కూటమి ప్రభుత్వం పూర్తి చేస్తే ప్రజలకు మేలు కలుగుతుంది.

– పాపినేని వెంకటేశ్వరరావు, సర్పంచ్, సుబ్బాయిగూడెం

పనులను తక్షణమే పూర్తి చేయాలి



మా గ్రామంలో చేపట్టిన సచివాలయం పనుల్లో తలుపులు, కిటికీల ఏర్పాటు మినహా అన్ని పనులు పూర్తయ్యాయి. రంగులు కూడా వేశారు. ప్రభుత్వం స్పందించి అసంపూర్తిగా ఉన్న ఆయా పనులను పూర్తి చేసి తక్షణమే వినియోగంలోకి తీసుకురావాలి.

– కనగాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ, కొణకంచి

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



జగ్గయ్యపేటఅర్బన్: అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకునే పరిస్థితి లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరం లాంటిదని, దానిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) అన్నారు. పేట మండలంలోని అన్నవరం గ్రామానికి చెందిన బాణావత్ సామ్రాజ్యం ఇటీవల అనారోగ్యానికి గురై ప్రైవేటు ఆస్పత్రిలో వైద్య చికిత్స చేయించుకుని ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకుంది. ఆమెకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.62,336 మంజూరయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాతయ్య వారి నివాసంలో జరిగిన కార్యక్రమంలో సదరు చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అన్నవరం గ్రామ టీడీపీ నాయకుడు డోగుపర్తి విష్ణు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేసిన ఉదయభాను..

అనారోగ్యంతో ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు చేసుకున్న వత్సవాయి గ్రామానికి చెందిన మూరుమూరి రవికృష్ణకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన రూ.1,09,000 చెక్కును జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పట్టణ, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలి

- విజయవంతంగా దేశ వ్యాప్త సమ్మె
- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



జుజ్జూరులో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు



నందిగామ గాంధీ సెంటర్‌లో..



పెనుగంచిప్రోలులో వినతి పత్రం అందజేస్తున్న నాయకులు, కార్మికులు

నందిగామటౌన్: కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందించటంతో పాటు రూ.26 వేల కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జగ్గయ్యపేట, నందిగామ నియోజకవర్గాల వ్యాప్తంగా మంగళవారం కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. అనంతరం గాంధీ సెంటర్‌లో కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చటంతో పాటు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చుతుందన్నారు. లేబర్ కోడ్‌ల వల్ల కార్మికులకు తీరని అన్యాయం జరుగుతుందని తక్షణమే నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా మధ్యాహ్న భోజన పథకం పాఠశాలల్లోని సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది వేతనాలతో పాటు భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే విడుదల చేయాలన్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో ఇచ్చిన సమ్మె కాలపు హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న కార్మికులకు రూ.10 లక్షల ప్రమాద బీమా, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, ఆశా వర్కర్‌లు, అంగనవాడీ కార్యకర్తలకు ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ ఖాశిం, దాసవరపు సైదా, సలికేటి నరేష్, పుట్ట మాణిక్యం, నల్లాని నాగమణి, ఆదిలక్ష్మి, వనజ, ఆదూరి సుశీల, శ్రావణ్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి..

పెనుగంచిప్రోలు: కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి దారా నాగేశ్వరరావు అన్నారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ నిర్వహించిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మంగళవారం కార్మికులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ భాస్కరరావుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలన్నారు. కార్మికుల క్లెయిమ్స్‌ను వెంటనే విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను తక్షణమే రద్దు చేయాలి..

వీరులపాడు: కార్మికులకు శాపంగా మారిన లేబర్ కోడ్‌లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి లాల్ అహ్మద్ గౌస్ పేర్కొన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండలంలోని జుజ్జూరు గ్రామంలో వివిధ రంగాల్లోని కార్మికులు మంగళవారం నిరసన ర్యాలీ చేశారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు పనికి తగ్గ వేతనంతో పాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన కార్మికులకు అందించాలని కోరారు. నాయకులు సాయమ్మ, లక్ష్మి, కృష్ణవేణి, మందా రాణి, సంధ్య, ముద్దుబి, సామ్రాజ్యం, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో ధర్నా

జగ్గయ్యపేటఅర్బన్: కార్మికులకు శాపంగా మారిన లేబర్ కోడ్‌లను ప్రభుత్వాలు రద్దు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు పట్టణంలో నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. పాత మున్సిపల్ కార్యాలయం కూడలి నుంచి కమలా సెంటర్, బలుసుపాడు రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించి లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ మండల గౌరవ అధ్యక్షురాలు సోమోజు నాగమణి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దొడ్డి దారిలో ఈ లేబర్ కోడ్‌లను రూపకల్పన చేసి ప్రవేశపెట్టారని విమర్శించారు. కార్పొరేట్ కంపెనీలకు అనుకూలమైన విధానాల్లో భాగంగానే కోడ్‌లు తీసుకువచ్చారని తెలిపారు. లేబర్ కోడ్‌లను రద్దు చేసి, తిరిగి కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. జూలై 9న జరిగే సమ్మెకు అందరూ సన్నద్ధం కావాలని, ఇప్పటి నుంచే సమ్మె నోటీసులు ఇవ్వాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ గౌసమియా, నాయకులు రావెళ్ల నాగేషు, కోట రవికుమార్, దంతాల నరేంద్ర, రాంప్రసాద్, మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు పారా ఎలకమ్మ, ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ వర్కర్లు, పంచాయతీ వర్కర్లు, ప్రభుత్వాస్పత్రి పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కంచికచర్లలో నిరసన

కంచికచర్ల: కార్మికులకు శాపంగా మారిన లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని కోరుతూ జూలై 9న విజయవాడలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ స్థానిక అంబేడ్కర్ సెంటర్‌లో మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. సీఐటీయూ జిల్లా నాయకుడు ఎం.సోమేశ్వరరావు మాట్లాడుతూ.. లేబర్‌కోడ్ అమలు కోసం కూటమి ప్రభుత్వం మద్దతు పలకటం సిగ్గుచేటని ఆరోపించారు. విశాఖ ఉక్కును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి కార్మికుడిపై ఉందని గుర్తుచేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు పుల్లమ్మ, భూషణం, వెంకటేశ్వరరావు, రోజ్‌మేరీ, గోవిందమ్మ పాల్గొన్నారు.



పేటలో ధర్నా చేస్తున్న కార్మిక సంఘాలు



కంచికచర్ల అంబేడ్కర్ సెంటర్‌లో నిరసన ప్రదర్శన చేస్తున్న దృశ్యం

లేబర్ కోడ్స్ చట్టాల రద్దుకు డిమాండ్



వత్సవాయిలో నిరసన..

వత్సవాయి: లేబర్ కోడ్స్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి బి.రాము డిమాండ్ చేశారు. దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా మండల కేంద్రం వత్సవాయిలో మంగళవారం కార్మికులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్న చట్టాలను నేడు మోడీ ప్రభుత్వం చట్టాలను మార్పు చేస్తూ కార్మికుల పొట్టకొడుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్‌కు వత్తాసు పలుకుంతుందని విమర్శించారు. కార్యక్రమంలో ఆశా యూనియన్ సంఘ నాయకులు జి.నాగేశ్వరి, జి.ఉమా, హమాలీ సంఘం నాయకుడు వై.వెంకటేశ్వర్లు, కిరణ్‌కుమారి, జానకీ, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేసవి విజ్ఞాన తరగతులు



టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామచంద్రుడు, పాఠకులు, విద్యార్థులు

కొణకంచి(పెనుగంచిప్రోలు): స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతులు కొనసాగుతున్నాయి. ఉమ్మడి రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా మంగళవారం గ్రంథాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు యోగా శిక్షకులు మొండితోక మణి, బి.సురేష్ యోగాసనాలు నేర్పించటంతో పాటు ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. అలాగే విద్యార్థులచే పుస్తక పఠనం చేయించటంతో పాటు పాటలు పాడించి, ఆటలు ఆడించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి టంగుటూరి విశేష కృషి

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ముందుగా టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగు పండిట్ షేక్ ఇస్మాయేల్ మాట్లాడుతూ.. ఆంధ్ర రాష్ట్రాభివృద్ధికి టంగుటూరి విశేష కృషి చేశారన్నారు. ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. టంగుటూరి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులచే పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో గ్రంథ పాలకుడు అల్లూరు రామచంద్రుడు, ఎం.కనకారావు, నీలం సర్వేశ్వరరావు, బిట్ర రాహుల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



కంచికచర్లలో నివాళులర్పిస్తున్న ఇస్మాయేల్, రామచంద్రుడు, విద్యార్థులు

ఆర్టీసీలో ఉత్తమ సిబ్బందికి ప్రశంసాపత్రాలు



ఉత్తమ డ్రైవర్ బాబుకు ప్రశంసాపత్రం, నగదును అందజేస్తున్న ఆర్టీసీ అధికారులు

బస్టాండ్(విజయవాడ పశ్చిమ): ఉత్తమ ప్రతిభ కనపర్చిన ఆర్టీసీ సిబ్బందికి మంగళవారం సంస్థ ఉన్నతాధికారులు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులను అందచేశారు. విజయవాడ మెయిన్ డిపో గ్యారేజీలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రజా రవాణా సంస్థ విజయవాడ జోన్-2 ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయరత్నం పాల్గొని 2024-25 సంవత్సరానికి గాను విజయవాడ డిపోలో పని చేస్తూ ఉత్తమ ప్రతిభను కనపర్చిన 75 మంది ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జరిగిన కుంభమేళాకు మొదటిసారిగా ఎన్టీఆర్ జిల్లా నుంచి 29 బస్సులను నడిపినట్లు తెలిపారు. వీటి ద్వారా రూ.92.25 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. యాత్రికులు ఆర్టీసీ బస్సులను ఆదరించి ప్రయాణించటం సంతోషంగా ఉందన్నారు. వెళ్లిన బస్సులన్నిటిలో ప్రయాణికులకు సౌకర్యవంతమైన, సురక్షితమైన ప్రయాణాన్ని అందించామన్నారు. ఆర్టీసీపై ప్రయాణికులకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టుకున్నామన్నారు. దీంట్లో ఆర్టీసీ సిబ్బంది కృషి ఎంతో ఉందన్నారు. డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది ఎంతో కష్టపడి పనిచేయటం వల్లే అంత సుదూర ప్రాంతాలకు కూడా బస్సులు సురక్షితంగా వెళ్లి వచ్చాయన్నారు. అనంతరం సిబ్బందికి ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఏసుదానం, పీఎన్‌బీఎస్ డెప్యూటీ సీటీఎం శ్రీనివాసరావు, విజయవాడ డిపో మేనేజర్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై యాసిడ్ దాడి

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): గుంటుపల్లిలోని ఓ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై ఉపాధ్యాయిని సోమవారం రాత్రి యాసిడ్ దాడికి పాల్పడింది. ఈ ఘటనలో స్వల్పంగా గాయపడిన ప్రిన్సిపాల్‌ను గొల్లపూడిలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గుంటుపల్లి డాన్‌బాస్కో పాఠశాలలో ఇబ్రహీంపట్నానికి చెందిన ప్రియదర్శిని ఉపాధ్యాయినిగా పనిచేస్తోంది. పాఠశాల యాజమాన్యం నెల రోజుల కిందట వివిధ కారణాలు చూపి ఆమెను విధుల నుంచి తొలగించారు. తనను తొలగించడంపై ఆరా తీసేందుకు కుటుంబ సభ్యులతో కలిసి పాఠశాలకు వచ్చిన ఆమె ప్రిన్సిపాల్ విజయ ప్రకాష్‌ను ప్రశ్నించింది. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఆమెతో పాటు తెచ్చుకున్న యాసిడ్ బాటిల్ ప్రిన్సిపాల్‌పై విసిరింది. ఈ దాడిలో ప్రిన్సిపాల్ గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

ఎంపీ కేశినేని శివనాథ్



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని చిన్ని, వేదికపై ఎమ్మెల్యే తాతయ్య తదితరులు

జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర అధ్యక్షతన మున్సిపల్, సచివాలయాల సిబ్బందితో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య)తో కలిసి ఎంపీ చిన్ని పాల్గొని మాట్లాడారు. జగ్గయ్యపేట మున్సిపాలిటీ ఇంకా అభివృద్ధి చెందాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదిక ఇవ్వాలని మున్సిపల్ చైర్మన్‌ను, కమిషనర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహనరావు, కౌన్సిలర్లు కన్నెబోయిన రామలక్ష్మి, గొట్టె నాగరాజు, నాయకులు మైనేని రాధా, వేదులాపురి సైదేశ్వరరావు, కర్ల జోజి పాల్గొన్నారు.

చెత్త డంపింగ్ యార్డుతో దుర్వాసన

జగ్గయ్యపేటఅర్బన్: ముక్త్యాల రోడ్‌లోని పద్మావతినగర్ – విలియంపేట మధ్య ఉన్న చెత్త డంపింగ్ యార్డు వలన వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నామని ఆ ప్రాంత వాసులు ఎంపీ కేశినేని శివనాథ్ ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా మంగళవారం ముక్త్యాల రోడ్‌లో ఉన్న మున్సిపల్ చెత్త డంపింగ్ యార్డును ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, స్థానికులతో కలిసి ఎంపీ చిన్ని పరిశీలించారు. డంపింగ్ యార్డులో చెత్త, వ్యర్థాలను కాల్చడం వలన భరించలేని పొగ, దుర్వాసన వస్తుందని స్థానికులు వారికి తెలిపారు. మూడు నెలల్లో డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, మున్సిపల్ కమిషనర్ రామ్మోహనరావు, కౌన్సిలర్లు గొట్టె నాగరాజు, కన్నెబోయిన రామలక్ష్మి, నాయకులు మైనేని రాధా, వేదులాపురి సైదేశ్వరరావు, జోజి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు వసతులు..

పట్టణంలోని జీవీజే జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా మైదానంలో కొనసాగుతున్న ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ శిక్షణ శిబిరాన్ని ఎంపీ కేశినేని చిన్ని ఎమ్మెల్యే తాతయ్యతో కలిసి పరిశీలించారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు కావల్సిన సదుపాయాలు, వసతులు కల్పిస్తామని ఎంపీ తెలిపారు. పట్టణంలోని విజయవాడ రోడ్‌లో వైఎస్సార్ సర్కిల్ సమీపంలో నిర్మాణంలో ఉన్న శివాజీ మహరాజ్ కోట నిర్మాణ పనులను వారు పరిశీలించారు. హిందూ ధర్మరక్షకుడు శివాజీ మహరాజ్ విగ్రహం ఏర్పాటుచేయడం చరిత్రాత్మకమని నిర్మాణ కమిటీ సభ్యులను ఎంపీ అభినందించారు.